క్లుప్తంగా

సుప్రీం తీర్పు హర్షణీయం


చిందాడ బాబి

పెద్దాపురం: మాదిగ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు, ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చిందాడ ప్రకాశరావు (బాబి) అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎస్సీ వర్గీకరణపై మాదిగలు చేస్తున్న పోరాటం సరైనదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎంఆర్‌పీఎస్ సుదీర్ఘ పోరాటం విజయవంతమైందన్నారు. అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలల వేసి ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు జరుపుకోవాలని బాబి పిలుపునిచ్చారు.

నిత్యాన్నదానానికి రూ.35 వేల విరాళం


పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేసిన దాతలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు గురువారం రూ.35 వేలు విరాళంగా అందజేశారు. పెద్దాపురం పట్టణానికి చెందిన చిలుకూరి వెంకటలక్ష్మి రూ.25వేలు, శ్రీవైట్ల సత్యవతి రూ.10 వేలు నగదు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో దాతలకు ఆలయ వేదపండితులచే ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ


పనసపాడులో పింఛను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజప్ప


సామర్లకోట: మండలంలోని పనసపాడు గ్రామంలో సర్పంచ్ చీకట్ల వెంకటేష్ అధ్యక్షతన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 6,435 మందికి 6,128 మందికి, మండల పరిధిలో 11,880 మందికి 10,980 మంది పింఛన్లు మొదటి రోజునే పంపిణీ పూర్తి చేశామని కమిషనర్ జె.రామారావు, ఎంపీడీఓ ఎస్టీడీ శ్యామ్‌సుందర్ తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం హైస్కూల్ విద్యార్థులకు గురువారం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి, రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీను, గొల్లపల్లి నానాజీ, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై క్విజ్ పోటీలు


క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులతో డీఎంహెచ్‌వో, వైద్య, ఆరోగ్య బృందం

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో 8, 9 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐ, ఆర్‌టీఐ, జనరల్ హెల్త్ అంశాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. వివిధ రౌండ్లలో ఉత్కంఠ భరితంగా సాగిన ఈ క్విజ్ పోటీలలో ఎంజీఎంసీ ఉన్నత పాఠశాల గాంధీనగర్-కాకినాడ విద్యార్థులు తొలిస్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతికి ఎంపికయ్యారు. రమణయ్యపేటకు చెందిన మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచి రూ.4 వేల నగదు బహుమతికి అర్హులయ్యారు. అలాగే, జగన్నాథపురానికి చెందిన బీఆర్ఎంసీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించి రూ.3 వేల నగదు బహుమతి సాధించారు. విజేతలు ఈ నెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం నాడు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ నియంత్రణాధికారి చేతుల మీదుగా బహుమానాలు అందుకోనున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ గురువారం విజేతలకు ప్రశంసా పత్రాలు అందించి అభినందనలు తెలిపారు.

మాతృత్వం మురిసేలా

- సేవే పరమావధిగా అన్నదానం
- వినూత్న సేవలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం


ఆసుపత్రిలో బల్లపై కూర్చుని భోజనం చేస్తున్న గర్భిణులు


పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఫేస్‌బుక్ టీం సభ్యులు

పెద్దాపురం: తల్లికి పట్టెడన్నం పెట్టలేని స్థితిలో నేటి తరం ఉన్న ఈ రోజుల్లో మేమున్నామంటూ ముందుకు సాగుతోంది ఆ యువబృందం.

యువతంతా సమూహంగా ముందుకు సాగుతూ.. తమ వంతు సాయం అందజేసి తమ ఆలోచనకు రూపకల్పన చేశారు. దీంతో ప్రతి బుధవారం గర్భిణి, తల్లులకు మాతృత్వం పేరిట అన్నదానం చేస్తూ సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు 'మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం'.

వేడివేడి భోజనం, పౌష్టికాహారం

పెద్దాపురం ఏరియా ఆసుపత్రి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే గర్భిణులకు ప్రతి బుధవారం మాతృత్వం పేరుతో ఫేస్‌బుక్ టీం సభ్యులు భోజనంతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్ణయించింది. దీని కోసం ప్రత్యేకమైన వంట గదిని ఏర్పాటు చేసింది. గర్భిణులకు అందించే ఆహారంలో పప్పులు, కూరగాయాలు, స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో హైప్రోటీన్ ఫుడ్‌ను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

20 వారాలుగా నిరంతరాయంగా..

20 వారాలుగా యువబృందం సుమారు రెండు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో గండేపల్లి, జగ్గంపేట, రంగంపేట, ఏలేశ్వరం తదితర మండలాల నుంచి గర్భిణులు ప్రతి వారం చికిత్సకు వస్తుంటారు. ప్రతి వారం సుమారు 150 మంది నుంచి 200 మంద వరకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది..



ప్రతి నెలా ఆసుపత్రిలో భోజనం చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి నెలా బుధవారం పరీక్షలకు వచ్చేటప్పుడు చాలా సమయం పడుతుంది. భోజనం సమయం అయినా ఎక్కడా తినే వీలుండేది కాదు. అటువంటి తరుణంలో మాతృత్వం పేరుతో మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం మంచి సేవలందిస్తోంది.

– సంధ్యారాణి, గర్భిణి, కాట్రావులపల్లి, జగ్గంపేట

తల్లి రుణం తీర్చుకోవాల్సిందే



జన్మనిచ్చిన తల్లి రుణం ప్రతి బిడ్డా తీర్చుకోలేరు. అమ్మకు ఎంత సేవ చేసినా ఆమె రుణం తీర్చ లేనిదే. అటువంటి తల్లికి ఏం చెయ్యాలి? నా తల్లి ఒక్కరికే కాదు అందరూ తల్లులకు పట్టెడన్నం పెడితే ఉండే సంతృప్తి వర్ణణాతీతం. అందుకు యువత అందరం కలిసి ప్రతి వారం బిడ్డలకు జన్మనిచ్చే తల్లులకు భోజనం పెట్టాలనే ఉద్దేశంతో మాతృత్వం పేరిట ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నాం.

– నరేష్ పెదిరెడ్డి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్, పెద్దాపురం

పఠన సామర్థ్యాన్ని పెంచుకోవాలి

ఎంఈఓ-2 పుల్లయ్య


ఉప్పరగూడెం పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: విద్యార్థులు రీడింగ్ ఎబిలిటీపై శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య అన్నారు. మండల పరిధిలో ఉప్పర గూడెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలలోని ప్రతి పాఠ్యాంశాన్ని చదవడంతో పాటు పాఠ్యాంశంపై పట్టు సాధించాలన్నారు. మేథమెటిక్స్ ఫండమెంటల్ ఆపరేషన్‌ను ఆయన పరిశీలించారు. పాఠశాలలో జరిగే ఎస్ఎంసీ ఎన్నికల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని హెచ్ఎంకు సూచించారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయాలని చెప్పారు. ఎన్నికలల్లో రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. హెచ్ఎం భాస్కర్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పోటీల్లో భాగస్వాములు కండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

పెద్దాపురం: న్యాచురల్ ఫొటో ఎగ్జిబిషన్ పోటీల్లో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, ది పెద్దాపురం ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు వరహాలరాజు అన్నారు. ఈ నెల 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గురువారం పోటీల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. 6,7 తరగతి విద్యార్థులు జూనియర్స్ విభాగంలోనూ, 8, 9, 10 తరగతుల వారు సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. తీసిన ఫోటోలు 79016 97939 నెంబర్‌కు డ్యాక్యుమెంట్ ఫైల్‌లో 12వ తేదీలోగా పంపించాలని కోరారు. కార్యక్రమంలో సాహితి స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, నేహా, బంగారం, ఫోటో యూనియన్ నాయకులు రమణ, సతీష్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా


కొమరగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకాగా పనిచేస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారంగా ఇవ్వాలన్నారు. తల్లి పాలు ఇచ్చే వారిలో గర్భాశయ, అండాశయ రొమ్ముల్లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ ఉంటాయని తెలిపారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించండి

- ఆర్డీఓ సీతారామారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోరుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (జీపీఆర్ఎస్)లో అందజేసే విజ్ఞాపనలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ జే.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధ సమస్యలు, మ్యూటేషన్స్ తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై చర్చించారు. మ్యూటేషన్లు అన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు.

మరిడమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


మరిడమ్మతల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల పట్టణ పరిధిలో రాజీవ్ గృహకల్ప, సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా, గణపతినగరం, పెద్దాపురం రోడ్డు, లారీ స్టాండ్ ఏరియా, గాంధీనగర్, అమ్మాణమ్మ అపార్టుమెంట్, పెదపులి చెరువు ఏరియా, మాజేటినగర్, భాస్కర్‌నగర్, సాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

పారిశుధ్య సమస్యపై కమిషనర్‌కు వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన కౌన్సిలర్ కాళ్ల శ్యామల తదితరులు

సామర్లకోట: స్థానిక 16వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ కాళ్ల శ్యామల మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావుకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ప్రతి వార్డులో ఇద్దరు శానిటరీ వర్కర్లు ఉండగా తమ వార్డులో ఒకరే ఉన్నారని, రెండు నెలల కిత్రం పదవీ విరమణ చేసిన కార్మికుని స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని పేర్కొన్నారు. దాంతో తన భర్త లక్ష్మీనారాయణ నెలకు రూ.16 వేలు చెల్లిస్తూ మరొకరిని ఏర్పాటు చేశారన్నారు. అలాగే వార్డులో చంద్రశేఖర స్వామి గుడి నుంచి ఏలేరు కాలువ వరకు ఉన్న డ్రైను పూర్తిగా పూడుకుపోయి శిథిలమైందని, దాని స్థానంలో కొత్త డ్రైనేజీ నిర్మించాలన్నారు. దీనికి తోడు చంద్రశేఖరస్వామి, వెంకటేశ్వరస్వామి, కావమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వార్డులో సమస్యలు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ నిధులతో డ్రైన్లు, పూడిగ తీత పనులకు ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికుల సమస్య ప్రతి వార్డులో ఉందని, దీనిని కలెక్టర్‌కు వివరిస్తామని కమిషనర్ తెలిపారు. ఆమె వెంట ఏడో వార్డు కౌన్సిలర్ జట్ల మోహన్, కాళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బడ్డీ కొట్టు యజమానికి నోటీసు

సాక్షి ఇంపాక్ట్


పొన్నాడలోని జగనన్న లే అవుట్‌లో బడ్డీ కొట్టుకు నోటీస్ అతికిస్తున్న పంచాయతీ కార్యదర్శి సత్తిబాబు

కొత్తపల్లి: పొన్నాడ పంచాయతీ పరిధిలో జగనన్న లే అవుట్‌లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసిన యజమానికి పంచాయతీ కార్యదర్శి సత్తిబాబు నోటీసు జారీ చేశారు. సాక్షి దిన పత్రికలో గురువారం ప్రభుత్వ స్థలం ఆక్రమణ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ యజమానికి నోటీసు అందజేశారు. నోటీసు అందుకున్న 24 గంటల్లో బడ్డీ కొట్టును తొలగించాలని, లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బడ్డీ కొట్టులు ఏర్పాటు చేయకూడదన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం శానిటేషన్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏసమ్మ, సీఐటీయూ నాయకుడు చిన్నా మాట్లాడుతూ కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి బకాయిలో ఉన్న ఆరు నెలల జీతాలు విడుదల చేయాలని వీరికి పని ముట్లు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, రామరావు, సత్యవతి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాట ఫలితం వర్గీకరణ

నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు


సామర్లకోటలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన మాదిగ సంఘ నాయకులు

సామర్లకోట: 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించగలిగామని మాదిగ సంఘాల నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. వర్గీకరణకు సుప్రీమ్ కోర్టు అనుమతి ఇవ్వడంతో మాదిగ నాయకులు గురువారం స్థానిక స్టేషన్ సెంటర్‌లోను, బళ్లమార్కెట్ సెంటర్‌లోను సంబరాలు చేసుకున్నారు. మాదిగ సంఘ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని, కాపవరపు కుమార్, తాతపూడి కృష్ణబాబు, వల్లూరి సత్యవతి మాట్లాడుతూ వర్గీకరణ కోసం జరిగిన పోరులో ప్రాణాలను కొల్పోయిన వారికి నివాళులు అర్పించారు. అలాగే అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళ్లు అర్పించి, క్షీరాభిషేకం చేశారు. మాదిగ నాయకులు గొడత విజయకుమార్, నందికి చక్రవర్తి, మిరియాల సాగర్, మందపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణకు చురుగ్గా ఏర్పాట్లు


పంచారామ క్షేత్రంలో శాకంబరి అలంకరణకు కూరగాయలను సిద్ధం చేస్తున్న దీపారాధన సంఘ సభ్యులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అమ్మవారి శాకంబరి అలంకరణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏటా ఆషాఢమాసం మాస శివరాత్రి రోజున బాలాత్రిపుర సుందరిదేవిని శాకంబరిగా అలంకరిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని కూరగాయలతో సుందరంగా అలంకరిస్తారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో ఆలయ దీపారాధన సంఘ సభ్యులు ఈ అలంకరణలో పాల్గొన్నారు. దాతలు, ఆలయం నుంచి ఏర్పాటు చేసిన సుమారు రెండు వందల కేజీల కూరగాయలతో ఈ అలంకరణ చేసిన్నట్లు ఈఓ తెలిపారు.

రోడ్లు జలమయం


పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో లారీల ఆఫీసు వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు


పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతంలో పలు రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొయ్యిల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో సైతం నీరు నిలిచిపోయింది. పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద, కొండెవరం, లారీలు ఆఫీసు వద్ద, ఉప్పాడ బీచ్‌రోడ్డ సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నీరు నిలిచిపోతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లల్లో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



పాలెం, గోనేడ మధ్యలో ప్రయాణికుల కోసం ఆగిన బస్సు

కిర్లంపూడి: ఏలేశ్వరం డిపో నుంచి మండలం పరిధి సామరాయణంపేట, పాలెం, తామరాడ, రామచంద్రపురం గ్రామాల మీదుగా కాకినాడకు నూతనంగా ఆర్టీసీ సర్వీసును గురువారం ప్రారంభించారు. ఏటిపట్టు గ్రామాలైన తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం, సోమరాయణంపేట గ్రామాల ప్రజలు పట్టణాలకు చేరుకోవాలంటే ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది. అంతేకాకుండా గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసుతో ప్రారంభించడంతో ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ


సమర్పించిన సారె


సారె సమర్పించిన మహిళలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి, పదో శక్తి పీఠం అయిన పురుహూతికా అమ్మవార్లకు గురువారం విరవ గ్రామానికి చెందిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం మహిళలు ఆషాడం సారెను సమర్పించారు. మహిళలంతా తమకు తోచిన పదార్థాలను గుడివద్దకు తీసుకొచ్చి ఊరేగించి, అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఏకరూప దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.